## అధ్యాయము 46

# ఐగుప్తు దేశమునకు యాకోబు కుటుంబము యొక్క వలస

చరిత్రలో జరిగిన అత్యంత నాటకీయమైన కుటుంబిక పునఃకలయికల ననుసరించి, తన కుటుంబము ఐగుప్తునకు మారుటకు యోసేపు అన్ని ఏర్పాట్లు చేశాడు. 46వ అధ్యాయము అక్కడకు వారు చేసిన ప్రయాణమును ప్రస్తావిస్తుంది మరియు యాకోబు యొక్క సంతానము వారి వంశావళిని కూడా ఇస్తుంది. హెబ్రీయులు ఐగుప్తులోనికి వచ్చినప్పుడు, ఫరో తన మంత్రితో వారికున్న సంబంధాన్ని బట్టి వారిని స్వాగతించాడు మరియు గోషెనులో వారి నివాసమును చేసుకొనమని వారిని అనుమతించాడు.

## బెయేర్షెబా దగ్గర దేవుడు యాకోబుకు ఆదరణనిచ్చుట మరియు ఐగుప్తునకు వారి ప్రయాణము (46:1-7)

**1అప్పుడు ఇశ్రాయేలు తనకు కలిగినదంతయు తీసికొని ప్రయాణమై
బెయేర్షెబాకు వచ్చి తన తండ్రియైన ఇస్సాకు దేవునికి బలులనర్పించెను. 2అప్పుడు
రాత్రి దర్శనములయందు దేవుడు–యాకోబూ యాకోబూ అని ఇశ్రాయేలును
పిలిచెను. అందుకతడు–చిత్తము ప్రభువా అనెను. 3ఆయన–నేనే దేవుడను, నీ తండ్రి
దేవుడను, ఐగుప్తునకు వెళ్లుటకు భయపడకుము, అక్కడ నిన్ను గొప్ప జనముగా
చేసెదను. 4నేను ఐగుప్తునకు నీతోగూడ వచ్చెదను, అంతేకాదు నేను నిశ్చయముగా
నిన్ను తిరిగి తీసికొని వచ్చెదను; యోసేపు నీ కన్నులమీద తన చెయ్యి యుంచునని
సెలవియ్యగా 5యాకోబు లేచి బెయేర్షెబా నుండి వెళ్లెను. ఫరో అతని నెక్కించి
తీసికొనివచ్చుటకు పంపిన బండ్లమీద ఇశ్రాయేలు కుమారులు తమ తండ్రియైన
యాకోబును తమ పిల్లలను తమ భార్యలను ఎక్కించిరి. 6వారు, అనగా యాకోబును
అతని యావత్తు సంతానమును, తమ పశువులను తాము కనానులో సంపాదించిన
సంపద యావత్తును తీసికొని ఐగుప్తునకు వచ్చిరి. 7అతడు తన కుమారులను తన**

**కుమారుల కుమారులను తన కుమార్తెలను తన కుమారుల కుమార్తెలను తన యావత్తు సంతానమును ఐగుప్తునకు తనతోకూడ తీసికొనివచ్చెను.**

**వచనము 1.** పరిశీలన చేయగా, **ఇశ్రాయేలు** (యాకోబు) అబ్రాహాము మరియు ఇస్సాకునకు ఒకప్పటి నివాస స్థలమైన హెబ్రోనులో జీవించి ఉంటారు (35:27; 37:14). యోసేపు మరియు ఫరో చేసిన విన్నపము మేరకు, **తనకు కలిగినదంతయు తీసికొని** దరిదాపుగా ఇరువది ఆరు మైళ్ల దూరము ప్రయాణము చేసి, **బెయేర్షెబా** దగ్గర ఆగాడు. వాగ్దాన దేశము నుండి యాకోబు చేసిన రెండు ప్రయాణములు కూడా ఇక్కడే ప్రారంభమయ్యాయి, మరియు బెయేర్షెబా దగ్గర యాకోబుకు కలిగిన దైవప్రత్యక్షత 28:10-15లో బేతేలు దగ్గర కలిగిన ప్రత్యక్షతకు పోలినదిగా ఉంది. ఇది దరిదాపుగా ప్రాచీన కనానుకు దక్షిణ సరిహద్దు (2 సమూ. 24:2) మరియు ఇస్సాకుకు ప్రధానమైన స్థిరావాసము (26:23-33; 28:10). ఆ స్థలమును దాటితే నీటి కొరత ఉన్నందున సాగుచేయడం కష్టము. అక్కడ ఉన్న అరణ్య ప్రాంతము నుండి ఐగుప్తులో ఉన్న నైలు లోయకు ప్రయాణం చేయడం యాకోబు లాంటి వయసు గల వ్యక్తికి, అలాగే ఆయన భార్యలకు మరియు తన కుమారుల బిడ్డలకు కూడా కష్టమైన పని.

ఈ ప్రయాణమునకు సిద్ధపడే ముందు యాకోబు **తన తండ్రియైన ఇస్సాకు దేవునికి బలులనర్పించెను.** ఇక్కడ "బలి" అను పదమునకు ప్రయోగించబడిన పదము, ఇది ఆదికాండములో మరొకసారి 31:54లో మాత్రమే వస్తుంది. ఆ సందర్భంలో, దేవుని ముందు నిబంధన భోజనము చేసేఉండు మాంసమును ఉడికించే బలిపీఠమును సూచిస్తుంది. తరువాత, זֶבַח (*zebach*) అను పదము దేవునికి మ్రొక్కుబడులను మరియు కృతజ్ఞత అర్పణలను సమర్పించే క్రమంలో సమాధాన అర్పణను సూచించుటకు సాధారణ పదముగా ఉంది (లేవీయ. 3:1; 17:5).[1] ఇక్కడ బలినర్పించుట ద్వారా, బహుశా తన తండ్రి నిర్మించిన బలిపీఠము పైనే అర్పించుట ద్వారా, ఇస్సాకు ఆరాధించిన ఆ దేవుణ్ణే యాకోబు కూడా ఆరాధిస్తున్నాడని వెల్లడి చేస్తున్నాడు. ఇంకా ప్రత్యేకంగా, అబ్రాహాము మరియు ఇస్సాకు యొక్క దేవుడు ఆయనతోను మరియు ఆయన కుటుంబముతోను ఉంటాడని, ముఖ్యంగా వారు వాగ్దాన దేశమును విడచి ఐగుప్తునకు వెళ్తుండగా మరియు దేవుడు వారికి వాగ్దానము చేసినట్లుగానే అక్కడ ఒక నాలుగు వందల సంవత్సరములు విస్తరించుటకు వెళ్లుచుండగా, వారితో ఉంటాడనే నిశ్చయత కొరకు ఆయన ఎదురు చూసాడు (15:13-16).

**వచనము 2.** బలులు అర్పించిన తరువాత, **అప్పుడు రాత్రి దర్శనములయందు**[2] **దేవుడు–యాకోబూ యాకోబూ అని ఇశ్రాయేలును పిలిచాడు.** పితరుడు **చిత్తము ప్రభువా**[3] అని చెప్పి స్పందించాడు. 22:11లో, దేవుని దూత ద్వారా అబ్రాహాముకు ఇయ్యబడిన పిలుపు కూడా ఇదే విధమైన గుణాలను—అనగా మరలా మరలా పిలవడం ("అబ్రహామా," "అబ్రాహామా") మరియు ఆయన కూడా

అదేవిధంగా స్పందించడం ("చిత్తగించుము")—కలిగి ఉంది. ఈ విధానము తరువాత కాలములో నిర్గమకాండము 3:4లో మోషే పిలుపులో పునరావృతమౌతుంది.

**వచనము 3.** పునఃనిశ్చయతను కలిగించే మాటలతో దేవుడు యాకోబుకు తన్నుతాను గుర్తించుకున్నాడు: **నేనే దేవుడను, నీ తండ్రి దేవుడను, ఐగుప్తునకు వెళ్లుటకు భయపడకుము** అని పలికాడు. దేవుడు ఇటువంటి మాటలనే యాకోబు తండ్రియైన ఇస్సాకుతో ఆయన బెయేర్షెబా నుండి వచ్చినప్పుడు పలికాడు: "నేను నీ తండ్రియైన అబ్రాహాము దేవుడను, నేను నీకు తోడైయున్నాను గనుక భయపడకుము; నా దాసుడైన అబ్రాహామును బట్టి నిన్ను ఆశీర్వదించి నీ సంతానమును విస్తరింపజేసెదనని చెప్పెను" (26:24). ఇస్సాకు మరియు ఆయన మందల కాపరులు ఫిలిష్తీయుల ప్రాంతములో సంచరించుచున్నప్పుడు వారితో వారు పడిన అనేక పోరాటముల నేపథ్యంలో ఈ మాటలు చెప్పబడ్డాయి (26:15-23).

దేవుని పిలుపు యొక్క భాష మరియు విషయము దేవుడు యాకోబును ఒక ప్రవక్తగా పరిగణిస్తున్నాడా అన్నట్లుగా ఉన్నాయి. ఐగుప్తులో ఇశ్రాయేలు చేయవలసిన సంచారమును గూర్చి, ఆయన తరువాతి కాలంలో ప్రవక్తగా పిలిచిన (20:7) అబ్రాహాముకు చేసినట్లుగానే (15:13), దేవుడు ఈ పితరునికి కూడా కొంత ఆలోచనను ఇస్తున్నాడు. అబ్రాహాము ఐగుప్తు వెళ్లుటకు భయపడ్డాడు గనుక ఇది ప్రాముఖ్యం (12:10-13); మరియు యాకోబు యోసేపుతో ఉండుటకు కోరినప్పటికీ, ఆ పరదేశములో ఆయనకు మరియు ఆయన కుటుంబమునకు ఏమి జరుగబోతుందో అనే విషయమై ఆయన కొంత అనుమానముతోనే ఉన్నాడు. ప్రయాణము చేసి గోషెనులో నివసించే విషయంలో వారిలో ఉన్న ప్రతివిధమైన భయాలను దేవుడు తొలగిస్తున్నాడు.

ఇంకా దేవుడు [ఐగుప్తులో] **నిన్ను గొప్ప జనముగా చేసెదను** అని చెప్పాడు. ఆయన అబ్రాహాముతో చెప్పిన వాగ్దానమునకు ఇది పోలినదిగా ఉంది (12:2; 17:6, 16; 18:18 చూడండి). బేతెలు దగ్గర దేవుడు యాకోబుతో మాట్లాడుతూ ఆయనలో నుండి "జనమును జనముల సమూహమును" వచ్చునని వెల్లడి చేశాడు (35:11). నిజానికి, యాకోబు (ఇశ్రాయేలు) యొక్క సంతానము వారు ఐగుప్తులో "విస్తరించారు" (నిర్గమ. 1:7, 20)[4]; ఎట్లనగా వారి నిర్గమము సమయములో అక్కడ నుండి స్త్రీలు మరియు పిల్లలు కాకుండా 600,000 మంది బయటకు వెళ్లారు (నిర్గమ. 12:37; 38:26). సారములో "తన దేశమునకు జన్మనిచ్చుటకు దేవుడు వాడుకున్న గర్భము" ఐగుప్తు దేశము.[5]

**వచనము 4.** క్లుప్త వాక్యములో దేవుడు పితరునికి **నేను ఐగుప్తునకు నీతోగూడ వచ్చెదను** అని చెప్పాడు. తదుపరి కాలంలో దేవుడు ఇదేవిధమైన వాగ్దానమును మోషేకును (నిర్గమ. 3:12) మరియు యెహోషువకును (యెహోషువ 1:5), తన ప్రజలు వారి ముందున్న కష్టమైన సవాళ్లనుండి నడిపించమని వారిని పిలిచినప్పుడు, వారికి చేశాడు.

దేవుడు యాకోబుతో **నేను నిశ్చయముగా నిన్ను తిరిగి తీసికొని వచ్చెదను; యోసేపు నీ కన్నులమీద తన చెయ్యి యుంచునని** చెప్పి తన ప్రతిజ్ఞను ముగించాడు. యాకోబుతో చేసిన ఈ ఆఖరు వ్యాఖ్య చాలా హృద్యమైనదిగా ఉంది. యాకోబు యొక్క భూలోక ప్రయాణము ముగిసినప్పుడు, శాశ్వతముగా కోల్పోయాను అనుకున్న ఆయనకు ఇష్టమైన కుమారుడు ఆయనకు ప్రక్కన ఉంటాడు (49:33–50:1). Nahum M. Sarna ప్రకారం, ఇక్కడ ఇయ్యబడిన వివరణ "చనిపోయిన వ్యక్తి కన్నులను జ్యేష్ఠ కుమారుడు కాని లేదా సమీప బంధువు కాని సున్నితంగా మూస్తాడు"[6] అనే ఆచారాన్ని ప్రతిబింబిస్తుంది. యాకోబుకు ఇష్టమైన కుమారుడైన యోసేపు తన తండ్రికొరకు ఈ పాత్రను పోషిస్తాడు.

"నేను నిశ్చయముగా నిన్ను తిరిగి తీసికొని వచ్చెదను" అనే మాట యాకోబు ఏశావు యొక్క ఉగ్రతనుండి తప్పించుకొనుచున్నప్పుడు హారాను వెళ్లుటకు కనానును వీడినప్పుడు దేవుడు యాకోబుతో చేశాడు. అక్కడ దేవుడు అన్నాడు, "ఇదిగో నేను నీకు తోడైయుండి, నీవు వెళ్లు ప్రతి స్థలమందు నిన్ను కాపాడుచు ఈ దేశమునకు నిన్ను మరల రప్పించెదను" (28:15). ఈ సందర్భంలో ఈ మాటలు ఐగుప్తు నుండి యాకోబు తిరిగి వచ్చుటకు సూచిస్తున్నవి. ఈ పితరుడు ఏకాంతంగా విదేశీ సమాధిలో పాతిపెట్టబడడు; ఆయన యొక్క శరీరము తన కుటుంబ సమాధియైన మక్పేలాలో పాతిపెట్టబడుటకు కనానుకు తేబడును (49:28-33; 50:12-14). దేవుని వాగ్దానము ఐగుప్తు నుండి ఇశ్రాయేలీయులు బయటకు వచ్చి వాగ్దాన దేశములో స్థిరపడతారనే విషయాన్ని కూడా సూచిస్తుంది (15:13-16 చూడండి).

**వచనము 5.** దేవుని యొక్క ఈ వాగ్దానములను వినిన తరువాత, **యాకోబు** వెంటనే నిర్ణయాత్మకమైన కార్యాన్ని చేశాడు. ఆయన తన కుమారుల బలముపైనను మరియు దేవుని యొక్క కృపగల ఏర్పాటులపైన ఆధారపడియున్నను, ఆయన **బెయేర్షెబా**ను మరలా తిరిగి వస్తామనే ఎట్టి ఆలోచన కూడా లేకుండా విడచుటకు సిద్ధపడ్డాడు. కాబట్టి, **ఫరో అతని నెక్కించి తీసికొనివచ్చుటకు పంపిన బండ్లమీద ఇశ్రాయేలు కుమారులు తమ తండ్రియైన యాకోబును తమ పిల్లలను తమ భార్యలను ఎక్కించి** ముందుకు కదిలారు (45:19, 21, 27 చూడండి).

**వచనము 6.** కుటుంబము మొత్తానికి ఈ నిర్ణయం వేగమైన మార్పును తెచ్చింది, ప్రత్యేకంగా వృద్ధుడైన పితరునికి; అయినప్పటికీ యాకోబు ఎదురించలేదు. కుటుంబము **తమ పశువులను తాము కనానులో సంపాదించిన సంపద యావత్తును తీసికొన్నారు.** ఆఖరుకు **యాకోబును అతని యావత్తు సంతానమును ఐగుప్తునకు వచ్చిరి.**

**వచనము 7.** యాకోబు యొక్క కుమారులు యాకోబును, వారి కుటుంబాలను, మరియు వారి చరాస్తులన్నిటిని ఐగుప్తునకు తెచ్చారని 5 మరియు

6 వచనములు చెప్తుండగా, 7వ వచనము మాత్రము **అతడు [యాకోబు] తన కుమారులను తన కుమారుల కుమారులను తన కుమార్తెలను తన కుమారుల కుమార్తెలను తన యావత్తు సంతానమును ఐగుప్తునకు తనతోకూడ తీసికొనివచ్చెను** అని చెప్తుంది. మునుపటి వాక్యము తన కుమారుల ద్వారా యాకోబు రవాణా చేయబడిన ఒక భౌతికపరమైన వాస్తవికతను తెలియజేస్తుండగా, రెండవ మాట మాత్రము పితరుల సంస్కృతిలోని సామాజిక క్రమానికి అనుగుణ్యంగా ఉంది. గోత్రము యొక్క సమూల వలస అనునది అధీకృతము చేయబడాలి మరియు అప్పుడు మనుగడలో ఉన్న పితరునిచే సూచనప్రాయంగా జరుపబడాలి.

ఐగుప్తు దేశమునకు ప్రయాణమును చేసినవారిలో యాకోబు "కుమార్తెలు" కూడా ఉన్నట్లుగా 7వ వచనము పేర్కొంటుంది, కాని ఆదికాండము మొత్తములో పేర్కొనబడిన ఒకేఒక కుమార్తె దీనా మాత్రమే (30:21; 34:1; 46:15). ఈ విషయాన్ని ఎలా వివరించగలము? సాధ్యపడే ఒక సమాధానం ఏమంటే పేరులను నమోదు చేయని ఇంకొంతమంది కుమార్తెలు యాకోబుకు ఉండియుంటారు (34:9, 16, 21 చూడండి). ప్రాచీన బైబిల్ ప్రపంచంలో, స్వాస్థ్యము అనునది ఎప్పుడు కూడా మగ సంతానము ద్వారానే సంప్రాప్తించేది; కాబట్టి, స్త్రీల యొక్క పేరులు కొన్నిసార్లు వదిలేసేవారు. ఇంకొక ఆలోచన ఏమంటే "కుమార్తెలు" అనే పదము యాకోబు యొక్క "కోడళ్ల"ను కూడ సూచిస్తుంది (37:35పై గల వ్యాఖ్యలను చూడండి). మూడవ ఆలోచన ఏమనగా "కుమార్తెలు" అనే బహువచనము ఇక్కడ (మరియు 46:15లో కూడా) ఏకవచన అర్థములో, అంటే ఇతర పదములకు ("కుమారులు," "కుమారుల కుమారులు," "కుమారుల కుమార్తెలు") సమాంతరముగా ఉండుటకుగాను, ఉపయోగించబడి ఉంటుంది అనునది. 46:23లో "కుమారులు" అనే పదము ప్రయోగించబడినప్పటికీ ఒకే కుమారుడు అక్కడ ప్రస్తావించబడ్డాడు గనుక ఈ విధమైన వివరణ వచ్చింది.

7వ వచనములో యాకోబు యొక్క భార్యలను గూర్చి ఏమియు చెప్పలేదు. కుటుంబము ఐగుప్తునకు వెళ్లే మునుపే రాహేలు మరియు లేయాలు కనానులోనే మరణించారని ఇతర వాక్యభాగాలు చెప్పగా (35:19; 49:31), జిల్పా మరియు బిల్హా అనువారికి ఏమి జరిగినదో వాక్యము చాలా మౌనముగానే ఉంది.

## యాకోబు యొక్క వంశావళి (46:8-27)

**[8]యాకోబును అతని కుమారులును ఐగుప్తునకు వచ్చిరి. ఇశ్రాయేలు కుమారుల పేళ్లు ఇవే; [9]యాకోబు జ్యేష్ఠ కుమారుడు రూబేను. రూబేను కుమారులైన హనోకు పల్లు హెస్రోను కర్మీ. [10]షిమ్యోను కుమారులైన యెమూయేలు యామీను ఓహదు యాకీను సోహరు కనానీయురాలి కుమారుడైన షావూలు. [11]లేవి కుమారులైన గెర్షోను కహాతు మెరారి. [12]యూదా కుమారులైన ఏరు ఓనాను షేలా పెరెసు జెరహు. ఆ ఏరును ఓనానును కనాను దేశములో చనిపోయిరి. పెరెసు కుమారులైన**

హెస్రోను హామూలు. [13]ఇశ్శాఖారు కుమారులైన తోలా పువ్వా యోబు షిమ్రోను. [14]జెబూలూను కుమారులైన సెరెదు ఏలోను యహలేలు. [15]వీరు లేయా కుమారులు. ఆమె పద్దనరాములో యాకోబు వారిని అతని కుమార్తెయైన దీనాను కనెను. అతని కుమారులును అతని కుమార్తెలును అందరును ముప్పది ముగ్గురు. [16]గాదు కుమారులైన సిఫ్యోను హగ్గీ షూనీ ఎస్బోను ఏరీ ఆరోదీ అరేలీ. [17]ఆషేరు కుమారులైన ఇమ్నా ఇష్వా ఇష్వీ బెరీయా; వారి సహోదరియైన శెరహు. ఆ బెరీయా కుమారులైన హెబెరు మల్కీయేలు. [18]లాబాను తన కుమార్తెయైన లేయా కిచ్చిన జిల్పా కుమారులు వీరే. ఆమె యీ పదునారు మందిని యాకోబునకు కనెను. [19]యాకోబు భార్యయైన రాహేలు కుమారులైన యోసేపు బెన్యామీను. [20]యోసేపునకు మనష్షే ఎఫ్రాయిములు పుట్టిరి. వారిని ఐగుప్తుదేశమందు ఓనుకు యాజకుడగు పోతీఫెర కుమార్తెయైన అసెనతు అతనికి కనెను. [21]బెన్యామీను కుమారులైన బెల బేకెరు అష్బేలు గెరా నయమాను ఏహీ రోషు ముప్పీము హుప్పీము ఆర్దు. [22]యాకోబునకు రాహేలు కనిన కుమారులగు వీరందరు పదునలుగురు. [23]దాను కుమారుడైన హుషీము. [24]నఫ్తాలి కుమారులైన యహసేలు గూనీ యేసెరు షిల్లేము. [25]లాబాను తన కుమార్తెయైన రాహేలునకు ఇచ్చిన బిల్హా కుమారులు వీరే. ఆమె వారిని యాకోబునకు కనెను. వారందరు ఏడుగురు. [26]యాకోబు కోడండ్రును వినాయించి అతని గర్భవాసమున పుట్టి యాకోబుతో ఐగుప్తునకు వచ్చినవారందరు అరువది ఆరుగురు. [27]ఐగుప్తులో అతనికి పుట్టిన యోసేపు కుమారులిద్దరు; ఐగుప్తునకు వచ్చిన యాకోబు కుటుంబపు వారందరు డెబ్బది మంది.

**వచనములు 8-15.** యాకోబు సంతానము యొక్క వంశావళి (**ఇశ్రాయేలు కుమారుల**) పితరుల చరిత్రను గూర్చిన ఈ భాగాన్ని ముగించి ఐగుప్తులో అబ్రాహాము సంతానము వారు అడుగుపెట్టిన క్రొత్త కాలమునకు నాంది పలుకుతుంది. **ఐగుప్తునకు వచ్చిరి** (46:8) మరియు "ఐగుప్తునకు వచ్చిరి" (46:27) అనే పదసమూహములు ఈ వంశావళిని అమర్చి 46:5-7లో ఉన్న చారిత్రక కథనముతో అనుసంధానిస్తున్నాయి.

ఈ వంశావళి యాకోబుకు మొదటి భార్యయైన **లేయా కుమారులతో** మొదలౌతుంది. వారి పేరులు **రూబేను (జ్యేష్టుడు), షిమ్యోను, లేవీ, యూదా, ఇశ్శాఖారు,** మరియు **జెబూలూను.** కుటుంబము పద్దనరాములో నివసించినప్పుడు ఆమె వీరికి జన్మనిచ్చింది (29:31-35; 30:17-20). ఈ పురుషుల కుమారులు (అంటే యాకోబు యొక్క కుమారుల కుమారులు) కూడా పేర్కొనబడ్డారు.[7] యూదా కుమారులైన **ఏరును ఓనానును కనాను దేశములో చనిపోయిరి** (38:1-11) అని చెప్పుటకు రచయిత చాలా జాగ్రత్తపడ్డాడు; ఆ విధంగా, వారు యాకోబు కుటుంబముతో ఐగుప్తు దేశమునకు వెళ్లలేదు. తామారు ద్వారా యూదా కనిన కవలలైన **పెరెసు మరియు జెరహులను** కూడా ప్రస్తావించాడు, వీరి పుట్టుకలు 38:27-30లో నమోదు చేయబడినవి. పెరెసు యొక్క ఇద్దరు

కుమారులు (అంటే యాకోబుకు కుమారుల కుమారుల కుమారులు) కూడా పేర్కొనబడ్డారు. జాబితాలోని ఈ వరుస యాకోబు **కుమార్తెయైన దీనాతో** ముగుస్తుంది, ఈమెను లేయా కన్నది (30:21). మొత్తముగా, యాకోబు మరియు లేయాకు పుట్టిన వారు **ముప్పది ముగ్గురు.**

ఇక్కడ ఒక చిక్కు ఉంది ఎందుకంటే లేయా క్రింద పేర్కొనబడిన వారందరి సంఖ్య ముప్పది-నాలుగుగా ఉంది. వాక్యములో **అతని కుమారులును అతని కుమార్తెలును అందరును**[8] "ముప్పది ముగ్గురు" అని ఉన్నప్పటికీ, దీనా ఈ కథనము నుండి తప్పించబడిందని కొందరు అంటుంటారు. మరొక పరిష్కారము ఏమంటే ఏరు మరియు ఓనాను కనానులో మరణించారు గనుక ఇక్కడ లెక్కించబడలేదు, కాని దీనా మరియు యాకోబు కూడా లెక్కించబడ్డారు (యాకోబు అసలు మూలపురుషుడు అయినప్పటికీ). తరువాత, ఈ నలుగురి ద్వారా పొందిన సంతానము సంఖ్య (33+16+14+7) "డెబ్బది," అంటే యాకోబును కూడా కలిపి లెక్కించిన లెక్క తేలుతుంది (46:27).

**వచనములు 16-18.** ఆ తరువాత **లాబాను తన కుమార్తెయైన లేయా కిచ్చిన జిల్పా కుమారులు** వంశావళి ఇవ్వబడింది. కొంతకాలము మట్టుకు బిడ్డలను కనడం లేయా నిలిపివేసినప్పుడు, ఆమె యాకోబుకు జిల్పాను ఉపపత్నిగా ఇచ్చింది. అప్పుడు జిల్పా ఇద్దరు కుమారులకు జన్మనిచ్చింది, **గాదు** మరియు **ఆషేరు** (30:9-13). ఇక్కడ గాదు యొక్క ఏడుగురు కుమారులు పేర్కొనబడ్డారు, అలాగే ఆషేరు యొక్క నలుగురు కుమారులు మరియు ఒక కుమార్తె (**శెరహు**). ఆషేరు యొక్క కుమారుల కుమారులు కూడా ఇద్దరు పేర్కొనబడ్డారు. జిల్పా ద్వారా యాకోబుకు కలిగిన సంతానము యొక్క మొత్తము సంఖ్య **పదునారు మంది.**

**వచనములు 19-22. యాకోబు** [రెండవ మరియు అతిప్రియమైన] **భార్యయైన రాహేలు కుమారుల**తో వంశావళి ఇంకా కొనసాగుతుంది. ప్రాముఖ్యంగా, ఈ జాబితాలో రచయిత "యాకోబు భార్యగా" పేర్కొన్న భార్య ఈ నలుగురిలో ఈమే కావడం విశేషం; ప్రథమంగా పెండ్లి చేసుకొనుటకుగాను లాబానును కోరిన స్త్రీ ఈమే (29:18).

రాహేలు యొక్క మొదటి కుమారుడు **యోసేపు,** ఈయన పద్దనరాములో జన్మించాడు (30:22-24). కుటుంబము కనాను దేశమునకు తిరిగి వచ్చిన తరువాత, పదిహేడవ సంవత్సరములో యోసేపు **ఐగుప్తు** దేశమునకు బానిసగా అమ్మివేయబడ్డాడు (37:2, 28). చాలా సంవత్సరాల తరువాత, ఆయన ఫరో క్రింద రెండవ అధికారిగా నియమించబడి **ఓను యాజకుడైన పోతిఫెరా కుమార్తెయగు అసెనతు**ను పెండ్లాడాడు (41:45). ఈమె యోసేపుకు ఇద్దరు కుమారులను కన్నది, **మనష్షే** మరియు **ఎఫ్రాయిము** (41:50-52). కనాను నుండి వలస వెళ్లిన వారిలో ఈ ఇరువురు లేరు.

రాహేలు యొక్క మరొక కుమారుడు **బెన్యామీను.** నాటకీయ పరిస్థితులమధ్య, కనాను దేశంలో యాకోబు యొక్క ఈ కుమారునికి జన్మనిచ్చిన తరువాత రాహేలు

చనిపోయింది (35:16-19). కుటుంబము ఐగుప్తునకు తరలినప్పుడు బెన్యామీను తన ముప్పయవ దశమాంకపు మొదటి సంవత్సరములలో ఉన్నాడు గనుక, తన **కుమారులలో** ఎక్కువ మంది (ఒకవేళ అందరూ కాకపోయినా) బ్రతికి ఉండి ఉండకపోవచ్చు. ఇతర వాక్యభాగాముల ఆధారంగా (సంఖ్యా. 26:38-40; 1 దిన. 8:1-5), ఇక్కడ పేర్కొనబడిన వ్యక్తులలో కొందరు నిజానికి బెన్యామీను యొక్క కుమారుల కుమారులు అని కొందరు అంటుంటారు.[9] వీరు వలస వెళ్లిన సమయానికి వీరు పుట్టియుండక పోయినప్పటికీ, ఈ సంతానము వారు బ్రతికే ఉన్నట్లుగా రచయిత చెప్తున్నాడు.[10] హెబ్రీ పత్రిక రచయిత మాటలను అరువుకు తెచ్చుకోవాలంటే, వారు ఇంకను "[తమ] పితరుల గర్భములోనే" ఉన్నారు (హెబ్రీ. 7:10). **యాకోబునకు రాహేలు కనిన కుమారులగు –** యోసేపు మరియు అతని ఇద్దరు కుమారులు ఇంకా బెన్యామీను మరియు అతని పదిమంది కుమారులు - **వీరందరు పదునలుగురు.**

**వచనములు 23-25.** వంశావళిలోని ఆఖరు భాగము **లాబాను తన కుమార్తెయైన రాహేలునకు ఇచ్చిన బిల్హా కుమారులను** పేర్కొంటుంది. చాలా సంవత్సరాల కాలం పాటు రాహేలు బిడ్డలను కనలేకపోయినది గనుక, ఆమె బిల్హాను **యాకోబు**కు ఉపపత్నిగా ఇచ్చింది. బిల్హా ఇద్దరు కుమారులను **కన్నది, దాను** మరియు **నఫ్తాలి** (30:1-8). దాను ఒక కుమారునికి తండ్రి కాగా, నఫ్తాలికి నలుగురు కుమారులు కలిగారు. కాబట్టి, బిల్హా ద్వారా యాకోబు యొక్క సంతానము **వారందరు ఏడుగురు.**

**వచనములు 26, 27.** పితరుల కథనములను భద్రపరచుటలో, ప్రాచీన రచయితలు – ప్రేరేపితమైన పరిదుద్ధ గ్రంథపు రచయితలతో కలిపి – ఆధునిక కతనముల లేదా వంశావళిని నమోదు చేసేవారు ఏర్పరచుకున్న కఠినమైన నియమాలనుండి కొంచెం వ్యత్యాసముగానే ఉన్నారని చెప్పాలి. సంపూర్ణ వంశావళి కంటే కూడా శైలి బేధము ప్రాధాన్యత సంతరించుకున్నది గనుక ఆ జాబితాలను కంఠత చేసేవారు (మత్తయి 1:1-17 చూడండి). ఇంకా, ఒక వంశావళి అనునది ఒక పితరుని మీదనో లేదా గోత్రము మీదనో ఉంచుతున్న ఉద్ఘాటనను కూడా చూడగలం. ఐగుప్తులో ఈ పితరుని కుటుంబము ఉన్న కథనమునకు పరిశుద్ధ గ్రంథంలో మూడు వివిధ సంఖ్యలు ఇవ్వబడ్డాయి: **అరువది ఆరు** (46:26), **డెబ్బది** (46:27; నిర్గమ. 1:5; ద్వితీయ. 10:22 చూడండి), మరియు "డెబ్బది ఐదు" (అపొ. 7:14, 15).

మొదటి సంఖ్య, "అరువది ఆరు" (46:26)లో **ఐగుప్తు** నుండి యాకోబుతో కూడా వలస వచ్చిన **తన సొంత సంతానమువారు** మరియు **యాకోబు యొక్క కుమారులు భార్యలతో సహా** పేర్కొనబడలేదు. ఏరు మరియు ఓనాను అనువారు ఈ మూడు గణాంకాల నుండి కూడా తొలగించబడ్డారు ఎందుకంటే వీరు వలస చేయుటకు మునుపు చాలా సంవత్సరాల క్రితమే వారు మరణించారు (38:7, 10; 46:12). ఈ మొదటి సంఖ్యలో, యాకోబు లెక్కించబడలేదు; మరియు **యోసేపు**,

ఎఫ్రాయిము, మరియు మనష్షే అప్పటికే ఐగుప్తులోనే ఉన్నారు. డెబ్బది మంది కుటుంబ సభ్యులు ఉన్న ఈ కుటుంబములో నుండి ఈ నాలుగు పేరులను తొలగించినట్లయితే మొత్తము సంఖ్య అరువది ఆరు అవుతుంది. ఈ సంఖ్య యాకోబు కుమార్తెయైన దీనాను కూడా పేర్కొంటుంది (46:15).

యాకోబు కుటుంబమును గూర్చిన రెండవ సంఖ్య 46:27లో ఇవ్వబడింది. "డెబ్బది" అనే సంఖ్య యాకోబును (మూల పురుషునిగా) కలిగియుండి, మరియు యోసేపు, ఇంకా అతని ఇద్దరు కుమారులైన మనష్షే మరియు ఎఫ్రాయిములు. "ఐగుప్తు దేశములో యాకోబు కుటుంబ సభ్యుల" యొక్క పూర్తి సంఖ్య ఇది (NLT).

క్రొత్తనిబంధన కాలములో, యాకోబు మరియు అతని పరివారమంతటి యొక్క సంఖ్యను స్తెఫను "డెబ్బది అయిదు"గా అపొస్తలుల కార్యములు 7:14, 15లో, గ్రీకు భాషలోని LXX ఆధారంగా ఇచ్చాడు, గ్రీకు సంప్రదాయమునకు (గ్రీకు భాష మాట్లాడే) చెందిన స్తెఫను సన్హెద్రెను సభలో, అనగా యూదా మతములో ఉన్నత న్యాయస్థానమైన సభలో, యేసు యొక్క మెస్సీయత్వమును గూర్చి సాక్ష్యమిస్తున్న నేపథ్యంలో ఈ సంఖ్యను ఇచ్చాడు (అపొ. 6:8–7:57). ఈ యూదులను ఉద్దేశించి మాట్లాడుతూ, హెబ్రీ ప్రతులలో ఉన్న ఆదికాండపు కథనమును ఉపయోగించకుండా స్తెఫను గ్రీకు అనువాదాన్ని ఎందుకు ప్రస్తావించాడు? ఈ యూదులు గ్రీకు భాషను మాట్లాడేవారు గనుక ఆయన ఇలా చేశాడు. బబులోను దేశపు చెర కాలములో, యూదులు అరామి భాషను తమ సొంత భాషగా తీసుకున్నారు[11]; ఆ తరువాత (క్రీ.పూ. 538-536) యెరూషలేములో స్థిరపడిన వారిలో కొద్దిమంది హెబ్రీ భాషను మాట్లాడగలరు. అలెక్జాండరు చక్రవర్తి చేసిన దండయాత్రలతో (క్రీ.పూ. 334-323), మధ్యధరా ప్రపంచంలో గ్రీకు అనునది ప్రధానమైన భాషగా అయింది. ఎక్కువెక్కువ మంది ప్రజలు ద్విభాషా ప్రజలుగా మారారు; పాలస్తీనాలో ఉన్న యూదులలో చాలామంది అరామి మరియు గ్రీకు భాషలను క్రీ.శ. మొదటి శతాబ్దములోనే మాట్లాడేవారు.[12] కాబట్టి, స్తెఫను LXX నుండి ప్రస్తావించడం సహజమే.[13]

ఈ నేపథ్యమును మనస్సులో పెట్టుకొని, మన మూల ప్రశ్నకు సమాధానాన్ని చూద్దాం. అపొస్తలుల కార్యములు 7:14లో స్తెఫను ఎక్కువ మందిని చెప్పుటకు గల కారణము ఏమనగా గ్రీకు వాక్యము ఆదికాండము 46:20లోని వాక్యభాగమునకు మనష్షే యొక్క ఒక్క కుమారుని, ఎఫ్రాయిము యొక్క ఇద్దరు కుమారులను, మరియు ఈ ఇరువురి కుమారుల కుమారుని ఒక్కొకరిని కలిపి ఆ సంఖ్యను డెబ్బది అయిదు చేసింది. LXX చెప్తుంది,

> ఐగుప్తు దేశములో హీలీయోపోలిసుకు యాజకుడైన పెతేఫ్రేస్ కుమార్తెయగు అసెనతు యోసేపునకు కుమారులను కనెను, మనాస్సేసు మరియు ఎఫ్రాయిము అనువారలు. సిరియా దేశపు ఉపపత్ని మనాస్సేసుకు కుమారులను కనెను, వారిలో మకీరు ఒకడు. మరియు మకీరు గాలాదును కనెను. మనాస్సేసు

సహోదరుడైన ఎఫ్రాయిము కుమారులు; సుతలాము, మరియు తాము. మరియు సుతలాము కుమారులలో ఏదోము ఒకడు.[14]

ఇయ్యబడిన ఈ మూడు లెక్కలలో ప్రాముఖ్యమైనది ఏదనగా ఆదికాండము 46:27లో హెబ్రీ వాక్యభాగము పేర్కొనబడే సంఖ్యే: "డెబ్బది." ఆదికాండము 10వ అధ్యాయములో జనముల సంఖ్యను కూడా "డెబ్బది"గా ఇవ్వడం అనేది పెద్దగా ఆశ్చర్యం కలిగించే విషయం కాదు. మరి రెండు ప్రధానమైన అంకెల, అనగా "యేడు" మరియు "పది" (7x10=70), హెచ్చవేతగా "డెబ్బది" అను సంఖ్య ప్రాచీన కాలములలో సంపూర్ణతకు, పరిపూర్ణతకు మరియు సమస్తానికి సూచనగా ఉంది. ఆ డెబ్బది దేశములు ఆదాము యొక్క సంతానమంతటిని సూచించగా, "డెబ్బది" అనే అంకె ఇక్కడ "ఇశ్రాయేలు" కుమారులుగా పేరొందిన అబ్రాహాము, ఇస్సాకు మరియు యాకోబు సంతానమువారిని సూచించేదిగా ఉంది (46:8).

## యాకోబు మరియు అతని కుటుంబమును యోసేపు ఆహ్వానించుట (46:28-34)

**28అతడు గోషెనుకు త్రోవ చూపుటకు యోసేపునొద్దకు తనకు ముందుగా యూదాను పంపెను. వారు గోషెను దేశమునకు రాగా 29యోసేపు తన రథమును సిద్ధము చేయించి తన తండ్రియైన ఇశ్రాయేలును ఎదుర్కొనుటకు గోషెనుకు వెళ్లి అతనికి కనబడెను. అప్పుడతడు అతని మెడమీద పడి అతని మెడ పట్టుకొని యెంతో ఏడ్చెను. 30అప్పుడు ఇశ్రాయేలు యోసేపుతో – నీవింక బ్రదికియున్నావు; నీ ముఖము చూచితిని గనుక నేనికను చనిపోవుదునని చెప్పెను. 31యోసేపు తన సహోదరులను తన తండ్రి కుటుంబపు వారినిచూచి – నేను వెళ్లి యిది ఫరోకు తెలియచేసి, కనానుదేశములో ఉండిన నా సహోదరులును నా తండ్రి కుటుంబపువారును నాయొద్దకు వచ్చిరి; 32ఆ మనుష్యులు పశువులు గలవారు, వారు గొఱ్ఱెల కాపరులు. వారు తమ గొఱ్ఱెలను పశువులను తమకు కలిగినదంతయు తీసికొనివచ్చిరని అతనితో చెప్పెదను. 33గొఱ్ఱెల కాపరియైన ప్రతివాడు ఐగుప్తీయులకు హేయుడు గనుక ఫరో మిమ్మును పిలిపించి మీ వృత్తి యేమిటని అడిగినయెడల 34మీరు గోషెను దేశమందు కాపురముండునట్లు – మా చిన్నతనమునుండి ఇదివరకు నీ దాసులమైన మేమును మా పూర్వికులును పశువులు గల వారమై యున్నామని ఉత్తరమియ్యుడని చెప్పెను.**

**వచనము 28.** యాకోబుతో పాటు ఐగుప్తునకు వలస వచ్చిన యాకోబు సంతతివారిని పేర్కొనిన తరువాత, రచయిత ఆ ప్రయాణమును గూర్చిన తన కథనమును కొనసాగిస్తున్నాడు. వారు ఐగుప్తు యొక్క సరిహద్దుకు వచ్చినప్పుడు, పితరుడు **యూదాను** తమకు ముందుగా పంపాడు. యూదా తన సహోదరులతో

యోసేపును ఆ ఐగుప్తీయులైన వర్తకులకు అమ్మివలసినదిగా సలహా ఇచ్చి (37:26-28) యాకోబు మరియు తనకు అత్యంత ఇష్టుడైన కుమారుని మధ్య దూరాన్ని సృష్టించగా, తన తండ్రిని యోసేపుతో తిరిగి ఐఖ్యపరచుటకు ఆయన ప్రధాన పాత్రను పోషించవలసి వచ్చింది. సుస్పష్టంగా, ఈయన యాకోబు దృష్టిలో ఒక నూతన స్థానాన్ని పొందాడు (43:3-5 పై గల వ్యాఖ్యలను చూడండి). ఐగుప్తులో తన కుటుంబము వచ్చియున్నదని తెలుపుటకు యూదా **యోసేపునొద్దకు** [యాకోబుకు] **ముందుగా** వెళ్లి, యోసేపు సూచనలననుసరించి, **గోషెను దేశమునకు** వారికి **త్రోవచూపాడు** (45:10 చూడండి).[15] "గోషెనుకు మార్గమును వెదుకుటకు" ఆయన ముందుగా పంపబడ్డాడు అని NIV చెప్తుంది.

**వచనము 29.** యూదా ఐగుప్తులో ప్రవేశించినట్లుగా మనకు ఎట్టి సమాచారము లేదు, కాని బహుశా **యోసేపు**ను ఎక్కడ కనుగొనాలో ఆయనకు తెలుసు గనుక ఆయన నుండి సాదరమైన ఆహ్వానాన్ని పొందాడు. తన కుటుంబ ఆగమనమును గూర్చి ఆశతో ఎదురు చూస్తున్న యోసేపు వెంటనే తన **రథమును సిద్ధము** చేయించాడు. తన ఆతురతలో, యోసేపు ఐగుప్తీ ప్రభుత్వంలో ఉన్నతమైన అధికారికి ఉండే హోదాను మరియు లాంచనాలను మరచాడు. ఆయన చాలా ఆతురతతో ఉన్న ఒక కుమారుడు, కాబట్టి వెంటనే ఆయన **తన తండ్రియైన ఇశ్రాయేలును ఎదుర్కొనుటకు గోషెనుకు వెళ్లాడు.** యాకోబును **చూచిన వెంటనే**, తన సహోదరుల మెడపై పడి మునుపు ఏడ్చిన యోసేపు భావోద్వేగాలతో నిండినవాడై **అతని** [తన తండ్రియొక్క] **మెడమీద పడి అతని మెడ పట్టుకొని యెంతో ఏడ్చాడు.**

**వచనము 30. ఇశ్రాయేలు** (యాకోబు) యోసేపు చంపబడ్డాడు అని నమ్మిన అనేక సంవత్సరాలుగా చాలా విరిగిపోయిన మరియు నిరాశతో నిండిన వ్యక్తిగా ఉన్నాడు. "నేను అంగలార్చుచు మృతుల లోకమునకు నా కుమారుని యొద్దకు వెళ్లెదను" అని ఆయన ప్రళాపించాడు (37:35). అయినప్పటికీ, యోసేపు ఇంకను బ్రతికేయున్నాడన్న వార్తను విన్నప్పుడు మరియు దీనికి కావాల్సిన ఆధారాలను చూసినప్పుడు, ఆయన యొక్క "ప్రాణము తెప్పరిల్లెను" (45:27). ఈ సమయములో, సుదీర్ఘకాలంగా తప్పిపోయిన తన కుమారుని కౌగలించుకొనుచుండగా, ఆఖరుగా ఆయన సంపూర్ణతను మరియు సమాధానాన్ని అనుభవించినవాడుగా అయ్యాడు. పెద్దవాడైన ఈ పితరుడు, **నీవింక బ్రదికియున్నావు; నీ ముఖము చూచితిని గనుక నేనికను చనిపోవుదును** అని **యోసేపుతో అంటాడు.**[16] తాను సమాధానంగా చనిపోవుటకు సిద్ధముగా ఉన్నాడని యాకోబు చెప్తున్నప్పటికీ, ఆయన ఇంకను పదిహేడు సంవత్సరాలు బ్రతికాడు (47:9, 28). కనాను దేశములో యోసేపుతో యాకోబు పదిహేడు సంవత్సరాల జీవితాన్ని అనుభవించాడు (37:2); మరియు, అనేక సంవత్సరముల ఎడబాటు తరువాత, ఐగుప్తులో యోసేపుతో కలిసి ఆనందించుటకు దేవుడు తన కృపగల అనుగ్రహంతో సమానమైన సంవత్సరాలను ఇచ్చాడు. తన శేషజీవితమును ఆయన తన కుటుంబీకులతో, బంధువులతో ఫరో యొక్క అధీనంలో మరియు

ఆశీర్వాదములతో ఐగుప్తులోనే జీవించాడు.

**వచనము 31.** మరొకసారి ఐగుప్తీలాంఛనమును జ్ఞాపకము చేస్తూ, **యోసేపు తన సహోదరులకు మరియు . . . తన తండ్రి కుటుంబమంతటికి** ఆయన ముందుగా **వెళ్లికనాను దేశమునుండి తనసొంత కుటుంబము** వచ్చినది అని ఆయనకు సమాచారము ఇవ్వాలని యోసేపు వారికి తెలిపాడు. ఫరో ఇచ్చిన కృపగల ఏర్పాటు ఈ కుటుంబము ఐగుప్తునకు వలస వచ్చి స్థిరపడుటకు అవకాశాన్ని ఇచ్చింది (45:17, 18) మరియు ఈ మర్యాదసూచకమునకు యోసేపు తగిన గౌరవమును చూపవలసినవానిగా ఉన్నాడు.

**వచనము 32.** వారు పశువులు కలవారు మరియు వారు గొఱ్ఱెల కాపరులు అనే విషయాన్ని ఫరోకు తెలియజేయడం అనేది కూడా యోసేపు బాధ్యతే. ఎందుకనగా, వారు **తమ గొఱ్ఱెలను పశువులను** తమకు కలిగినదంతయు **తీసికొనివచ్చిరి** గనుక. ఐగుప్తీ దేశములో ఉన్న సాగుభూములను ఆక్రమించకుండా ఈ వలసవచ్చిన వారు స్థిరపడుటకుగాను గోషెను అనే ప్రాంతము వీలుగా ఉంటుందనే విషయమును ఫరో తెలుసుకోవాలని యోసేపు అనుకున్నాడు. తమతో తమకు కలిగినదంతయు తీసుకొనివచ్చుట ద్వారా, తమ వృత్తులలో కాక తమ నివాసస్థలంలో శాశ్వత మార్పును తీసుకురావాలనే వారి ఆశను యాకోబు మరియు ఆయన కుటుంబము వెల్లడి చేస్తుంది.

**వచనములు 33, 34.** ఆ రాజు యొక్క ప్రధానమైన ఆలోచనను ముందుగానే కనిపెడుతూ యాకోబు తన కుటుంబమును **ఫరోతో** కలవడానికి సిద్ధపరచాడు. పరదేశులైన గొఱ్ఱెల కాపరులు వారినుండి మరియు వారి సాగుభూమి నుండి వేరుపరచబడాలనేది ఐగుప్తీయుల ఆలోచన అనే విషయం ఆయనకు తెలుసు. అట్టి గొప్ప కుటుంబమును మరియు వారి దాసులను పోషించుటకుగాను వారు చేసే **వృత్తి**ని గూర్చి ఫరో వారిని ప్రశ్నిస్తాడు అని యోసేపు వారికి తెలియజేశాడు. ఆ విధంగా రాజు ప్రశ్నించినప్పుడు **మా చిన్నతనమునుండి ఇదివరకు నీ దాసులమైన మేమును మా పూర్వికులును పశువులు గల వారమై యున్నామని ఉత్తరమియ్యుడని చెప్పి** బదులివ్వమని యోసేపు వారికి ఆదేశించాడు. యోసేపు యొక్క బంధువర్గము వారు ఐగుప్తీ ప్రజల యొక్క సారవంతమైన భూములకు దూరంగా **గోషెను**లో జీవించుటలో ముఖ్య ప్రణాళిక ఏమనగా, వారు ఐగుప్తీయులచే ఒక హానిగా భావించబడకుండా ఉండాలనే.[17] **గొఱ్ఱెల కాపరియైన ప్రతివాడు ఐగుప్తీయులకు హేయుడు** అనే విషయాన్ని బహుశా వారు వినియుంటారు. ఐగుప్తీయుల పంటలను మరియు సాగుభూములను ఇట్టి గొప్పయైన మందలు మరియు గొఱ్ఱెలు పాడుచేసే అవకాశం ఉన్నందున ఈ విధమైన వారి ఆలోచన సరియైనదే. ఐగుప్తీయులు పశువులన్నిటికి విరోధులు కారని మనకు తెలుసు; 47:6లో యాకోబుకు చెందిన కొంతమంది "ప్రజ్ఞకలవారిని" తన సొంత మందలపై "అధిపతులుగా నియమించు"టకు అధికారము ఇచ్చాడు. ఇంకా, నైలు నది ఒడ్డున బురదలో మేస్తున్న బలిసిన ఆవులను గూర్చిన ఫరో యొక్క కల ప్రాచీన ఐగుప్తులో

తరచూ కనబడే దృశ్యమే (41:1-3). కొన్ని పశువులు బహుశా నైలు నది సమీపంలో కంచెవేసిన ప్రాంగణములో బహుశా ఉంచబడేవి. ఐగుప్తీయులు గొఱ్ఱెల కాపరులను ద్వేషించుకొనుటకు మరొక కారణము నైలు పరీవాహక లోయలోని ప్రజలు పవిత్రంగా భావించే జంతువులను ఇశ్రాయేలీయులు కొన్నిసార్లు తమ ఆరాధనలలో బలిగా ఉపయోగించేవారు గనుక (నిర్గమ. 8:25-27).[18]

గోషెనులో ఒక నూతన గృహములో స్థిరపడిన తరువాత యాకోబు కుటుంబము యొక్క సమస్తమైన అవసరతలు తీరాయి. భవిష్యత్తులో వారికి సంభావింపబోయేవి ఏమీ వారికి తెలియదు, కాని దేవుని ప్రణాళికలో తరువాతి దశకు చేరుకొనుటకు వారు సిద్ధముగా ఉన్నారు.

# అన్వయము

## విశ్వాసము ద్వారా నడచుట (45:16–46:34)

జీవితములో మనము అనుభవించే కొన్ని పరీక్షలు తరచూ మనకు అర్థంకాకుండా ఉంటాయి. ఉపద్రవం మధ్యలో కూడా క్రైస్తవులు “వెలిచూపును బట్టి కాక, విశ్వాసము ద్వారానే నడవవలసిన”వారిగా ఉన్నారు (2 కొరింథీ. 5:7). భౌతికపరంగా మనం చూసే దానికంటే కూడా జీవితము ఎంతో ఉన్నతమైనది. “సమస్తము సమకూడి జరుగులాగున” మనము దేవునిపై ఆధారపడాలి (రోమా. 8:28) మరియు ప్రేరేపితమైన తన వాక్యములోని వాగ్దానాలను నమ్మాలి.

*దైవికమైన ప్రణాళికకు దేవుని ప్రజలు విశ్వాసము ద్వారా స్పందించి తన చిత్తమును నెరవేర్చుటకు గాను దైవానుగ్రహము కలిగిన తన హస్తము కార్యముచేస్తుంది అని గ్రహించాలి.* సాధారణంగా, విశ్వాసము ద్వారా కాకుండా వెలిచూపును బట్టి నడచుటకు ప్రజలు చాలా సౌకర్యవంతంగా అనుకుంటారు. యాకోబు తన చూపును నమ్మి యోసేపు మరణించాడని నమ్మాడు. వేరే కోణంలో చూస్తే, తన కుమారుని యొక్క కథను గూర్చి ఆయనకు ఎప్పుడూ కొన్ని అనుమానాలు ఉన్నట్లుగా తెలుస్తుంది. షిమ్యోనుతో వారు ఐగుప్తు నుండి తిరిగి వచ్చి మరలా షిమ్యోనును తిరిగి తెచ్చుటకు వారు మరలా ఐగుప్తు వెళ్లవలసినవారిగా ఉన్నారు అని తన కుమారులు యాకోబుతో అన్నప్పుడు, పెద్దవయసు గల ఈ పితరుడు తన అనుభూతులను ఈ విధంగా వెళ్లగ్రక్కాడు: “మీరు నన్ను పుత్రహీనునిగా చేయుచున్నారు; యోసేపు లేడు; షిమ్యోను లేడు; మీరు బెన్యామీనును కూడా తీసికొనపోవుదురు; ఇవన్నియు నాకు ప్రతికూలముగా ఉన్నవి” అని పలికాడు (42:36). ఇక్కడ యోసేపును ప్రస్తావించుటలో, తన కుమారులు యోసేపు యొక్క అపహరణ విషయంలో అగుపడుతున్నంత అమాయకులు అయితే కారు అని యాకోబు ఎప్పుడూ అనుమానించినట్లుగా తెలుస్తుంది.

ధాన్యమును కొనుగోలు చేయుటకు సహోదరులు రెండవమారు ఐగుప్తునకు వెళ్లి తిరిగివచ్చినప్పుడు, వారు చాలా మహోత్తరంగా అనిపించిన ఒక కథను చెప్పారు. "యోసేపు ఇంక బ్రదికియుండి ఐగుప్తు దేశమంతటిని ఏలుచున్నాడు" అని వారు చెప్పారు. తన కుమారులు చెప్పిన మాటలను బట్టి యాకోబు "నిశ్చేష్టుడాయెను"; మరియు, అనేక సంవత్సరాలుగా వారిమధ్య గల సంబంధం కొంత దెబ్బతిన్నది గనుక "అతడు వారి మాట నమ్మలేదు" (45:26). ఏమైనప్పటికీ, తన కుటుంబము అంతయు ఐగుప్తునకు వెళ్లవలసినదిగా ఫరో అధికారాన్ని ఇచ్చాడని వారు యాకోబుకు తెలియజేశారు. వారు ఐగుప్తు దేశమందలి "మంచి వస్తువులను" పొందుతారు మరియు ఆ "దేశము యొక్క సారమును" అనుభవించెదరు అని ఫరో వాగ్దానము చేశాడు (45:18). ఇంకా, వారి భార్యల, బిడ్డల మరియు వృద్ధుడైన తండ్రి యొక్క భారమును భరించులాగున "ఐగుప్తులో నుండి బండ్లను తీసికొనిపోయి" వాటికి అనేకమైన పశువులను కూడా అందించమని యోసేపును ఆదేశించాడు (45:19). వీటికి తోడు, యోసేపు తన సహోదరులకు వస్త్రములను మార్చాడు మరియు ప్రయాణమునకు కావాల్సిన అన్ని వసతులు చేశాడు; కాని బెన్యామీనుకు మాత్రం మూడు వందల తులముల వెండిని మరియు ఐదు దుస్తుల బట్టలుఇచ్చాడు (45:22). తన తండ్రికి, ఐగుప్తులోనున్న మంచి వస్తువులను మోయుచున్న పది గాడిదలను, ఇంకా ఇతర ధాన్యములను తినుబండములను మోయుచున్న పది ఆడు గాడిదలను ఐగుప్తు దేశము వరకు ప్రయాణము కొరకు ఇచ్చాడు (45:23).

"అప్పుడు వారు యోసేపు తమతో చెప్పిన మాటలన్నిటిని అతనితో [యాకోబుతో] చెప్పిరి" అని కథకుడు చెప్పినప్పటికీ (45:27), తన సహోదరుని అపహరణకు తామే కారణమని వారు తమ తండ్రితో ఎప్పుడు చెప్పారో అనే విషయం స్పష్టముగా లేదు. ఖచ్చితంగా, యోసేపు ఐగుప్తులోనికి ఎలా వచ్చాడు మరియు ఫరో ఆయనను అంతటి అధికారముగల ఉన్నతమైన స్థానమునకు ఎందుకు హెచ్చించాడు అనే విషయాలను యాకోబు తన కుమారులను అడిగే ఉంటాడు. 42:36లో వలె తమ తండ్రినుండి కఠినమైన మాటలను నియంత్రించుటకు యోసేపు తమతో పలికిన క్షమాపణార్థమైన మాటల నేపథ్యంలో యాకోబుతో యోసేపు పట్ల వీరు చేసిన కఠినమైన పనిని బయలుపరచే ఉంటారు. "అయినను నేనిక్కడికి వచ్చునట్లు మీరు నన్ను అమ్మివేసినందుకు దుఃఖపడకుడి, అది మీకు సంతాపము పుట్టింపనియ్యకుడి; ప్రాణరక్షణ కొరకు దేవుడు మీకు ముందుగా నన్ను పంపించెను" (45:5) అని పలుకుట ద్వారా యోసేపు దైవానుగ్రహమైన ఈ కార్యమును వివరించాడు. వేరేవిధంగా చెప్పాలంటే, "మేము యోసేపునకు చేసిన దానిని దేవుడు మంచికొరకే చేయుటకు సమర్థుడు" అని వీరు యాకోబుతో చెప్తున్నారు. నిజంగా, తన పరివారమంతటినీ, అలాగే కరువుతో నిండిన మధ్యధరా ప్రాంతపు ప్రజలందరినీ ఆకలిదప్పుల నుండి కాపాడుటకు దేవుడు యోసేపు ద్వారా కార్యము చేశాడు.

ఆ దేశమును రెండు సంవత్సరాలుగా ఆవరించిన ఆ కరువు ఇంకా ఐదు సంవత్సరాలు కొనసాగుతుందని యోసేపు వారికి తెలియజేశాడు. "కాబట్టి దేవుడేగాని మీరు నన్నిక్కడికి పంపలేదు. ఆయన నన్ను ఫరోకు తండ్రిగాను అతని యింటివారి కందరికి ప్రభువుగాను ఐగుప్తు దేశమంతటిమీద ఏలికగాను నియమించెను" అని తన సహోదరులతో యోసేపు అన్నాడు (45:8).

యాకోబు యోసేపును చూడకున్ననూ లేదా ఆయన స్వరమును వినకున్ననూ, వారందరూ మరియొకసారి కలిసి ఉండులాగున వారందరినీ ఐగుప్తు దేశమునకు తరలించుటకు తప్పిపోయిన తన కుమారుడు పంపించిన ఆ బండ్లను చూచినప్పుడు ఆయన ప్రాణము తెప్పరిల్లినది (45:27). అతను నమ్మాడు గనుక నాటకీయమైన ఈ మార్పు చోటుచేసుకుంది. "ఇంతే చాలును, నా కుమారుడైన యోసేపు ఇంకా బ్రదికియున్నాడు, నేను చావకమునుపు వెళ్లి అతని చూచెదను" అని ఆయన పలికాడు (45:28).

శతాబ్దాలుగా, యేసును చూడని లేదా ఆయన స్వరమును వినని విశ్వాసులకు కూడా ఇటువంటి ఒక సవాలే ఎదురయింది. క్రీస్తు యొక్క మరణమును, పునరుత్థానమును, మరియు పరలోక ఆరోహణమును కేవలము కొద్దిమంది మాత్రమే చూడగలిగారు (యోహాను 20:19-31; అపొ. 1:9-11; 1 కొరింథీ. 15:1-8). రెండు వేల సంవత్సరాలుగా విశ్వాసులు కలిగియున్న విశ్వాసము ఆయనను చూచుట వలననో లేదా ఆయనను వ్యక్తిగతముగా వినుటవలననో వచ్చినది కాదు, కాని లేఖనములలో ఇంకను సజీవంగా ఉన్న అపొస్తలుల సాక్ష్యము అనే ఆధారము ద్వారా నమ్మారు (రోమా. 10:17; హెబ్రీ. 4:12). శ్రమలను అనుభవిస్తున్న క్రైస్తవులకు పేతురు వ్రాసినప్పుడు ఇటువంటి విశ్వాసమునే ప్రస్తావిస్తున్నాడు. తన వ్యక్తిగత పరిచర్య కాలములో వారు యేసును చూడనూలేదు లేదా విననూలేదు, కాని చెప్పనశక్యమైన సంతోషముతో వారు ఆయనను విశ్వసించారు. అట్టి విశ్వాసము యొక్క ఫలము "[వారి సొంత] ఆత్మరక్షణ" (1 పేతురు 1:6-9). నేటి కాలములో టర్కీ అని పిలువబడుతున్న ప్రాంతంలో, పేతురు జీవితము యొక్క యదార్థతను బట్టి మరియు యేసుక్రీస్తు యొక్క సాక్ష్యమును బట్టి మొదటి శతాబ్దపు క్రైస్తవులు విశ్వసించారు. తనను ప్రేమించువారికందరికీ పరలోకములో వాడబారనిదియునైన స్వాస్థ్యమును తన నూతన జన్మద్వారా ప్రసాదించిన ప్రభువు మరియు రక్షకుడు యేసు అని పేతురుకు తెలుసు (1 పేతురు 1:1-5). అబద్ధమాడుట వలన ఈ గొప్ప అపొస్తలునికి వచ్చేది ఏమియు లేదు; నిజానికి, మానవపరంగా ఆలోచిస్తే ఆయన సమస్తమును కోల్పోవవలసి వచ్చింది, కాని ఆ దైవికమైన పిలుపునకు ఆయన నమ్మకముగా ఉన్నాడు. విశ్వాసములో ఆయన ఉంచిన మాదిరి తన సందేశమును మరింత శక్తివంతమైనదిగా చేసింది.

"విశ్వాసమనునది నిరీక్షింపబడువాటియొక్క నిజస్వరూపమును, అదృశ్యమైనవి ఉన్నవనుటకు ఋజువు" అని హెబ్రీ పత్రిక రచయిత అన్నాడు (హెబ్రీ.

11:1; NEB). విశ్వాస నేత్రము ద్వారా, మన నిరీక్షణలు ఎంతటి వాస్తవంగా మరియు ఖచ్చితంగా అవుతాయంటే మనము వాటిపై క్రియ చేయవచ్చు. షిమ్యోను మరియు బెన్యామీనుతో తన కుమారులు ఐగుప్తు నుండి తిరిగివచ్చి యోసేపు ఇంకా బ్రదికేయుండి ఐగుప్తీ ప్రభుత్వంలో ఫరోకు మాత్రమే క్రింద అధికారంలో ఉన్నాడు అని చెప్పినప్పుడు యాకోబు చేయవలసినదల్లా ఇదే. వేదనలో ఉన్న ఈ పితరుడు అనేక సంవత్సరాల పాటు యోసేపును చూడక ఆయన మరణించి ఉంటాడు అని అనుకుంటున్నప్పటికీ, విశ్వాసములో—అంటే తన పెద్ద కుమారులు ఇచ్చిన సాక్ష్యము ద్వారాను – తనకిష్టుడైన కుమారుడు ఐగుప్తు దేశములో శక్తివంతమైన గొప్ప నాయకుడు అయ్యాడు అని అంగీకరించాడు. యోసేపును మరలా చూస్తాను అనే యాకోబు నిరీక్షణకు ఆధారములు ఏవనగా ఆయన ముందు ఉన్నటువంటి బండ్లు, పశువులు, బహుమతులు, మరియు వస్తువులు. యాకోబు ఆ బండినెక్కి ఐగుప్తుకు తన ప్రయాణమును ప్రారంభించుచుండగా, ఆయన "వెలిచూపునుబట్టి" కాక "విశ్వాసము" ద్వారానే వెళ్లుచున్నాడు (2 కొరింథీ. 5:7). ప్రతి యుగములోను దేవుడు తన ప్రజల నుండి ఇట్టి స్పందననే కోరుతున్నాడు. పరలోకమనే మన సొంత గృహమునకు విశ్వాసమనే ఈ యాత్రలో మనము కొనసాగుతుండగా, ఈ లోకపు అనుమానాలను మరియు భయాలను అధిగమించే ఒక ఆయుధం విశ్వాసము అనే జ్ఞానముతో మనము కార్యము చేయాలి (1 యోహాను 5:4).

*ప్రభువునందు విశ్వసించి ఆయనకు లోబడువారికి తన సన్నిధినో గూర్చిన మరియు తుది గమనము వైపు మనతో ఉండే తన నడిపింపును గూర్చిన నిశ్చయత ఉంటుంది.* యోసేపు, ఫరో, మరియు తన కుటుంబమును గూర్చిన సంఘటనలు కొన్ని యాకోబు కనుల ముందు దొర్లుతున్నప్పుడు, అనేక సంతవ్సరాల క్రితము దేవుడు తన తాతయైన అబ్రాహామునకు ప్రకటించిన తన ప్రణాళికా నెరవేర్పు ఇదేనా అని పితరుడు ఆశ్చర్యపడిపోయి ఉంటాడు (15:13-16). స్వాభిమానము, ఈర్ష్య, బలాత్కారము, మరియు మోసము అనే విపరీత చేష్టలతో తన కుటుంబము నిండిపోయి ఉన్నప్పటికీ కూడా, దేవుడు తన కుటుంబము నుండి మరియు తన సంతానము వారినుండి అంతటి గొప్ప జనాంగమును నిజముగా చేయగలడా?

యాకోబు మరియు అతని కుమారులకు ఇది ఒక గొప్ప ఆనందమును మరియు వినయమును కలిగించవలసినటువంటి అనుభవము. కాబట్టి, తమ తండ్రి మరియు తమ తాతలు జీవించి ఆరాధించిన (21:31-33; 22:19; 26:23, 33) బెయేర్షెబాకు వారు వచ్చినప్పుడు, "తన తండ్రియైన ఇస్సాకు దేవునికి బలులనర్పించెను" (46:1). ఐగుప్తునకు వెళ్లుటకు దాటవలసిన అరణ్యములోనికి వారు ప్రవేశించే ముందు వచ్చే ఆఖరు మజిలీ ఈ బెయేర్షెబా. అనుభవజ్ఞులైన బాటసారులకు, ముఖ్యంగా మహిళలు మరియు పిల్లలతో వెళుతున్న వారికి, ఈ మార్గము గుండా వెళ్లడం అనేది చాలా నిరుత్సాహకరమైన సవాలు. పరిస్థితులు అన్నియు ఐగుప్తునకు మార్గమును సూచిస్తుండగా ఆ వాగ్దాన దేశమును వీడి

నైలు పరీవాహక ప్రాంతంలోని తూర్పు భాగాన, యోసేపు ఉన్నచోటికి దగ్గరగా, తన కుటుంబాన్ని తరలించడం అనేది దేవుని చిత్తమేనని యాకోబు తెలుసుకొనవలసియుంది.

సమాధానము కొరకు యాకోబు ఎక్కువ కాలము ఉండవలసిన అవసరము లేదు. బెయేర్షెబాలో ఆ రాత్రి దేవుడు స్వప్నమందు ప్రత్యక్షమై తన తండ్రియైన ఇస్సాకు దేవునిగా తన్నుతాను గుర్తించుకున్నాడు. ఐగుప్తునకు వెళ్లుటయందు ఆయనకున్న భయాలను అన్నిటిని తీసివేసుకోవాలని యాకోబును ఆయన ప్రోత్సాహించాడు. ఆయనతో కూడా వెళ్లి అక్కడ తన సంతానమును గొప్ప జనముగా చేసెదను అని ఆయనకు వాగ్దానము చేశాడు. ఇంకా, తుదకు యాకోబు ప్రజలందరినీ ఐగుప్తు నుండి బయటకు తీసికొనివస్తానని, మరియు యాకోబు మరణించినప్పుడు తన కన్నుల మీద చేతిని ఉంచుటకు యోసేపు తన ప్రక్కనే ఉంటాడని దేవుడు చెప్పాడు (46:3, 4). దీనికి మించి ఆ తండ్రి ఇంకేమి కోరుకొనగలడు? తన హృదయము వాంఛించిన ప్రతిదానిని దేవుడు ఆయనకు దయచేశాడు. ఈ గ్రహింపుతో, పితరుడు మరియు ఆయన ప్రజలందరూ బెయేర్షెబాను విడచి, దేవుడు తనతో ఉంటాడని మరియు క్షేమకరమైన ప్రయాణమునిచ్చి ఐగుప్తులో వారికి ఉజ్వలమైన భవిష్యత్తును దయచేస్తాడనే గొప్ప నమ్మకముతో, ఐగుప్తునకు తన ప్రయాణమును కొనసాగించారు (46:5, 7).

దేవుని యొక్క ప్రజలు ఎల్లప్పుడూ వారు ఆయన చిత్తమును చేయాలనే కోరిక కలిగి ఆయన వారితో ఉండాలనే హామీని కోరుకున్నారు. ఆయన వెళ్లుచున్నాను మరియు వారు ఆయనతో వెళ్లలేరు అని యేసు తన శిష్యులతో చెప్పినప్పుడు (యోహాను 13:33) పస్కా పండుగ చివరి రాత్రి బోజన సమయంలో ఇది స్పష్టమగుచున్నది. వారు తరువాత దేవుని యొక్క పరలోక నివాస స్థలమునకు ఆయనను వెంబడించుదురు అని చెప్పినప్పటికీ (యోహాను 13:36; 14:1, 2), ఆ వార్త వారిని కలవరపరచెను. మిమ్ములను అనాథలుగా విడువను, "మీ యొద్ద ఎల్లప్పుడూ ఉండుటకై" తండ్రి "వేరొక ఆదరణకర్త" (పరిశుద్ధాత్మ)ను మీకనుగ్రహించును అని యేసు వాగ్దానము చేసెను (యోహాను 14:16, 18). వారి హృదయాలలో మరియు జీవితాలలో పరిశుద్ధాత్మ నివసించుట అనునది, పౌలు తరువాత చెప్పినట్లు, "మీ [వారి] యందున్న క్రీస్తు, మహిమ నిరీక్షణయై యున్నాడు" (కొలస్సీ. 1:27).[19] శిష్యులను భయము మరియు కలవరమైన హృదయాలతో విడిచి వెళ్లేందుకు బదులు యేసు వారిని శాంతితో విడిచి వెళ్లెను (యోహాను 14:27). ఆయన మాటలకు ఋజువు తన శరీర పునరుత్థానము (లూకా 24:36-49), మరియు ఆయన "అనేక ఆమోదయోగ్యమైన ఆధారాలను" ఋజువు పరచెను (అపో. 1:3). దేవుని యొక్క సానిధ్యము అతనితో ఉండునను వాగ్దానముతో యాకోబు కనాను నుండి ఐగుప్తుకు వెళ్లిన విధముగా, సువార్త వ్యాప్తిని గూర్చి యేసు తన శిష్యులను ప్రపంచమంతటికీ పంపెను, "యుగసమాప్తి" వరకు ఆయన వారితో ఉండునని ప్రతిజ్ఞచేసెను (మత్తయి 28:18-20).

వీడ్కోలు యొక్క కన్నీటిని మించి విశ్వాసులు కుడా శాశ్వతమైన జీవితము మీద నమ్మకము కలిగి ఉండాలి. ఆయన ఆమె యొక్క సహోదరుడు లాజరు మరణించిన తరువాత మార్తతో మాట్లాడినప్పుడు మన నిరీక్షణకు మరొక కారణమును ఇచ్చెను: "పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును; బ్రదికి నా యందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు" అని చెప్పెను (యోహాను 11:25, 26). ఈ వర్ణనకు ఋజువుగా, నాలుగు రోజులుగా సమాధిలో ఉన్న, లాజరు యొక్క సమాది వైపునకు యేసు తిరిగి (యోహాను 11:39), మరియు "లాజరూ, బయటికి రమ్ము" అని చెప్పెను (యోహాను 11:43). తరువాత, చూస్తున్నవారికి ఆశ్చర్యం కలిగిస్తూ, సమాధి గుడ్డతో చుట్టబడి లాజరు సమాధిలో నుండి బయటకు వచ్చాడు (యోహాను 11:44). మరణము ముగింపు కాదని ఇది ఋజువుపరచింది, మరియు శరీరము మాత్రమే మరణిస్తుంది. తమ పాపముల నిమిత్తము పశ్చాత్తాపపడు వారికి, దేవుని కుమారుడైన క్రీస్తులో వారి విశ్వాసమును ఒప్పుకొని, మరియు వారి పాపములు కడగబడుటకు బాప్తిస్మము తీసుకొనిన వారు జీవిస్తూనే ఉంటారు. విదేయత గల ఈ విశ్వాసులు ఒకరోజు యేసు క్రీస్తు యొక్క పునరుత్థానము పొందిన విధముగా లేపబడుదురు మరియు ఆయన నిత్యజీవములో భాగస్వామ్యము కలిగియుందురు (రోమా. 6:5; 1 యోహాను 3:2, 3; 5:13).

---

సూచనలు

[1]Herbert Wolf, "זָבַד," in *TWOT*, 1:233. [2]ఆదికాండములోని మరియొక దర్శనాలు లేదా కలల కొరకు, 15:1, 5, 12; 20:3; 26:24; 28:12; 31:10, 24; 37:5, 9; 40:5; 41:1, 5 చూడండి. [3]పేరు పునరావృతము కాకుండా 31:11లో ఇదే విధమైన ఒక మార్పిడి కనిపిస్తుంది. [4]క్రొత్త నిబంధనలో, స్తెఫను మరియు పౌలు ఐగుప్తులో విస్తారమైన అభివృద్ధిని దృవీకరించెను (అపొస్తలుల కార్యములు 7:17; 13:17). [5]Bruce K. Waltke, *Genesis: A Commentary* (Grand Rapids, Mich.: Zondervan Publishers, 2001), 574. [6]Nahum M. Sarna, *Genesis*, The JPS Torah Commentary (Philadelphia: Jewish Publication Society, 1989), 313. [7]ఈ వంశావళిలోని వ్యక్తుల యొక్క మరింత వివరణ కొరకు, చూడండి Kenneth A. Mathews, *Genesis 11:27—50:26*, The New American Commentary, vol. 1B (Nashville: Broadman & Holman Publishers, 2005), 829–35. [8]46:23లో "కుమారులు"కు అయినట్లు, "కుమార్తెలు" బహుశా ఇక్కడ ఏకవచన అర్థమై ఉండవచ్చు. కేవలం దీనా మాత్రమే యాకోబు యొక్క కుమార్తెగా పిలువబడెను. [9]LXXలోని 46:21 యొక్క తర్జుమా కుడా ఈ సంబంధమును స్పష్టం చేసింది. [10]బెన్యామీను గోత్రములోని తెగల వారికి నాయకులైనందున బహుశా ఈ మనుష్యులు తెలుపబడెను.

[11]ఎజ్రా హెబ్రీ ప్రతుల నుండి యెరూషలేములోని ప్రజలకు దేవుని యొక్క ధర్మశాస్త్రమును చదివినప్పుడు, అది ప్రజలకు అర్థమగునట్లు అరామిలోనికి అనువదించుట అవసరమైనది (నెహెమ్యా 8:8, 12). [12]యూదుల అనెక్క సమాజ మందిరములు, సమాధులు, మరియు ఎముకలను దాయు స్థలముల యొక్క శాసనాలు పాలస్తీనాలో మొదటి శతాబ్దము క్రీ.పూ. నుండి మొదటి శతాబ్దము క్రీ.శ. వరకు గల కాలములోనివి కనుగొనబడినాయి, మరియు వాటిలోని సగము అరామీలో వ్రాయబడినవి మిగిలిన సగము గ్రీకులో వ్రాయబడెను. [13]యూదా మరియు అన్య క్రైస్తవులు కలిగియున్న సంఘములకు క్రొత్త నిబంధన రచయితలు గ్రీకు భాషలో పత్రికలు వ్రాయుటకు ఇది ఒక కారణము. మరియు వారు పాత నిబంధన లేఖన భాగములను ఉద్ధారముగా చెప్పినప్పుడు హెబ్రీ లేఖన ప్రతులకు బదులుగా LXXను వారు ఉపయోగించారు. [14]అదనపు పేర్లు సంఖ్యాకాండము 26:29, 35, 36 మరియు 1 దినవృత్తాంతములు 7:14, 20లలో కనిపిస్తాయి. [15]"గోషెను యొక్క దేశము" "రామెసేసు యొక్క దేశము"గా కుడా సూచించబడెను (47:6, 11), ఇది ఐగుప్తు యొక్క తూర్పు డెల్టా ప్రాంతములో ఉంది. [16]తరువాత, 46:30లోని సందర్భములో తన కుమారులు, మనష్షే మరియు ఎఫ్రాయిములను దీవించినప్పుడు యాకోబు యోసేపుతో మాట్లాడెను: ". . . నీ సంతానమును దేవుడు నాకు కనుపరిచి యున్నాడు" (48:11). [17]ఇంకా ముందుకు ఐదు సంవత్సరములు కరువు ఉన్నప్పటికీ, మరియు భూమి ఫలవంతముగా లేదు (45:11), యోసేపు భవిష్యత్తులో సమస్యలను తప్పించుచున్నాడు. [18]John T. Willis, *Genesis*, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1979), 434. [19]రోమీయులకు 8:9 చూడండి, అక్కడ "దేవుని యొక్క ఆత్మ" మరియు "క్రీస్తు యొక్క ఆత్మ" పర్యాయపాదములుగా ఉపయోగించబడెను.